# ఓ టెస్ట్ ట్యూబ్ బేబీ కథ!

అది **2010** సంవత్సరం—

హోటల్ ఇంటర్‌నేషనల్....

ఒక అందమైన అమ్మాయి ఒక టేబిల్ దగ్గర కూర్చొని అంతా కలయజూస్తూ ఉంది. ఆమె శరీరం బంగారంలా మెరుస్తూ, ఏవో వింత కాంతుల్ని, విచిత్ర సువాసల్ని ప్రసవిస్తోంది. ఆమె భుజాన "ట్రై మి వన్స్" బ్యాగ్ వ్రేలాడతోంది.

ఆమె దివ్య సౌందర్యానికి ముగ్ధుడయిన ఒక నవ యువకుడు ఆమెను సమీపించి, ఎక్స్‌క్యూజుమి! ఇఫ్ యు డోంట్ మైండ్ .... అంటూ ఆమె ఎదురు చైర్‌లో కూర్చున్నాడు.

ఐ–డోంట్–మైండ్ అంది గులాబిలాంటి పెదవులు విప్పి ఆ అందాల బాల. - అదోలా వుంది ఆ ఉచ్చారణ. థ్యాంక్యూ' అన్నాడు ఆ అబ్బాయి ఆమె అందాన్ని కళ్ళతో జుర్రుకుంటూ.

ఐయామ్ నేచర్" అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడా యువకుడు, చెయ్యి ముందుకు చాస్తూ—

"మై నేమ్ ఈజు టి–టి–బి–సిక్స్" అ చెయ్యి అందుకోకుండా ప్రశాంతంగా అన్నది ఆమె. నేను కేథలిక్కుని, మీరు??" "అదే కెమికల్?" "మిస్ టి–టి–బి–సిక్స్! మీరు రిలిజియన్ పుచ్చుకోలేదా??"!

"ఏమో? మెడిసన్స్ మాత్రం గంటగంటకూ పుచ్చుకుంటూ ఉంటాను."

ఇంతలో వెయిటర్, "హలో! వాట్ కెన్ ఐ సర్వ్ యూ" అంటూ వచ్చాడు. నేచర్ మెనూ కర్డ్ చూడసాగాడు. ఆమె ఆర్డరివ్వసాగింది.

"బ్రింగ్ మి విటమినేట్స్ డిష్ అండ్ పెన్సిలిన్ జెల్లీ!" అదిరిపడ్డాడు వెయిటర్‌తోపాటు నేచర్. అయితే నేచర్ అదొక జోక్‌గా తీసుకుని, కొన్ని డిషెస్‌కు ఆర్డరిచ్చాడు. వెయిటర్ వెళ్ళిపోయాడు.

మీకేదిష్టం?" అడిగాడు తను ఆర్డర్ ఇచ్చిన డిషెన్‌లో ఫుడ్."

నైస్‌గర్ల్" అదో జోక్‌గా భావించాడు నేచర్. "నై?" "యువర్ ఇన్ ఆర్ సో బ్రైట్ లైక్ స్టార్స్." 'స్టార్స్?' అంటూ ఆమె హొటల్ లోకి వస్తున్న, వెళుతున్న మనుషులను గంభీరంగా చూడసాగింది. అది గమనించిన ఆ యువకుడు, "మిస్ టి-టి-బి-సిక్స్! మీరు హొటల్‌కు రావడం ఇది ఫస్ట్ టైమా?" అని అడిగాడు. "యా...."

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నారు??" ఆశ్చర్య పోయాడతడు.

"కేర్ చేంబర్‌లో "కేర్ చేంబరా? అదేమిటి?."

'అదో కొత్త రకం లాబొరేటరీ'

"అక్కడ మీరేం చేస్తుంటారు?"

"భోంచేస్తాను—చదువుకుంటాను—ఆడుకుంటాను-నిద్రపోతాను."

ఏమీ అర్థంగాక ఆ అమ్మాయి అంతా తమాషాగా మాట్లాడుతుందని గుర్తించి, పడీపడీ నవ్వసాగాడు నేచర్.

"మీ వళ్ళంగా అంత కాంతివంతంగా ఉందేం?" నవ్వుతూనే అడిగాడు ఆమె సొగసుల మత్తుకు బానిస అవుతూ, ఆమె కళ్ళల్లో. ముఖంలో వయసుకు తగ్గ ఎలాంటి ఎక్స్‌ప్రెషన్ లేకపోవడం అతన్ని కాస్త నిరాశ పరిచింది.

"ఐ-డోంట్-నో" అంది ఆమె సాధారణంగా. అందగత్తెలకు అమాయకత్వం అదనపు ఆకర్షణ! ముగ్ధలంటే మగవాళ్ళకు మరీ మోజు!!! నేచర్ ఆమె పరిమళంలో పరవశించిపోసాగాడు. ఇంతలో వెయిటర్ డిషెస్ తెచ్చిపెట్టాడు. ఆమె ఏమీ తీసుకోలేదు. సూప్ మాత్రం సిప్ చేయసాగింది.

నేచర్—తింటూ, మెల్లగా టేబిల్ క్రింద మెరుస్తున్న ఆమె పాదాన్ని తన పాదంతో స్పృశిస్తూ, కాలి వేళ్ళతో ఆమె మోకాలి వరకూ గౌనునూ ఎగదోస్తూ, ఆమెలో చలనం కలిగించాలని చూస్తూ, సెక్సీగా మాటలు రువ్వుతూ ఆమెను మత్తెక్కించాలని ప్రయత్నిస్తున్నాడు

దేనికీ ఆమె చలించటం లేదు. కానీ, కాలి స్పర్శకు మాత్రం 'రియాక్ట్' అవుతూ ఉంది. ఆ అనుభూతి కూడా కళ్ళలో బహిర్గతం కావడం లేదు, కద

ఠీకలో వ్యక్తమవుతూ ఉంది ముద్ద మందారంలా ఉంది కానీ, మంకు ఘటమే! అనుకున్నాడు నేచర్ మరింత ఉద్వేగపడుతూ.

ఇంతలో లైట్స్ "డిమ్" అయ్యాయి. అదో రకమైన మ్యూజిక్ స్టార్ట్ అయింది. మనిషిలో కామాన్ని మరింత రెచ్చగొట్టేందుకు నిర్దేశింప బడింది, ఆ సంగీత ధార! నేచర్ మెల్లగా ఆమె పక్కకు చేరి, ఆమె భుజాల మీదకు చేతులు పోనిచ్చి దగ్గరకు లాక్కుంటూ, వంగి, మెత్తగా, మత్తుగా ఆమె లేత పెదవులను చుంబించాడు.

పెదవులు, పెదవులు కలుసుకోగానే ఆమెలో ఎక్కడలేని సంచలనం ప్రస్ఫుటమయింది. దీర్ఘ నిద్ర నుండి దిగ్గున లేచినట్లయింది. ఆమె కూడా ఆయువకుని మెడపై చేతులు వేసింది. అలాగే లేచి నిలుచుంది. కౌగిలించుకుంది.

మ్యూజిక్ చెవుల్లోంచి....శరీరమంతా మత్తుగా ప్రవహిస్తూ వుంది. రక్తనాళాల్లోని రక్తానికి ఎక్కడలేని వేగాన్ని, వేడినీ పుట్టిస్తూ వుంది. ఆమె అతణ్ణి పూర్తిగా తన గుండెలకు, పెదవులకూ హత్తుకుంది.

అలా.. అలా.. జలజలా, ఎంత అమృతం సృజింపబడిందో......

అలా...అలా...అలలలలుగా, ఎన్ని నిశ్వాస, ఉచ్ఛ్వాసలో......

అలా....అలా....కలలు, కలలుగా, ఎన్ని స్వర్గాలు దర్శించారో.....

ఇంతలో — లైట్లు వెలిగాయి. మ్యూజిక్ ఆగిపోయింది.

ఇదే అవస్థలో ఉన్న ఎన్నో జంటలు విడిపోయి—హాయిగా ఆనందంగా ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకొని, నవ్వుకుని, వెళ్ళి వారివారి టేబిక్స్ ఆక్రమించుకుని కూర్చున్నారు. కానీ,– ఆమె, అతడు అతుక్కు పోయినట్లున్నారు. నేచర్ విడిబడాలని విఫల ప్రయత్నం చేస్తున్నాడు. ఆమె కెక్కడుందో అంత బలం, ఆమె పట్టులోనుంచి వేరు కాలేక సతమత మవుతున్నాడు.

ఆమె చుంబనం మితిమించుతూంది. ఆమె కౌగిలి మరింత బిగుస్తూంది. వారిని చూసి, మిగిలిన వారందరూ నవ్వసాగారు. అయినా ఆమె ఆ యువకుణ్ణి వదల్లేదు. హోటల్లో అందరూ చుట్టుముాగి చప్పట్లు కొట్టసాగారు.

అయినా....వూ హు.... ఆమె అతడి ప్రాణం త్రాగేసేలా వుంది. ఆమె పరిష్వంగం భల్లూకపట్టులా అయింది. అతడు ప్రాణాపాయ స్థితిలో వున్నాడు. చుట్టూ ఉన్నవారికి అది అర్థం కావడంలేదు. అదో ఉన్మాద స్థితి అనుకుని హాహాకారాలతో వెర్రి ఆనందం అనుభవిస్తున్నారు.

పాపం అతనికి "హెల్ప్! హెల్ప్!!" అని అరిచే అవకాశం కూడా లేకపోయింది. అంత దృఢమైన ఆ యువకుడు శవంలా వ్రేలాడిపోతున్నాడు. అంతలో రివ్వున ఓ కారు వచ్చి హొటల్ ముందు ఆగింది. అందులో నుంచి లాంగ్ కోట్ వేసుకుని ఉన్న ఒక ఆజానుబాహుడు ఒక మెడికల్ కిట్‌లాంటి దానితో లోపలికి హడావుడిగా పరుగెత్తాడు.

అందరినీ త్రోసుకొని, లోనికెళ్ళి, కిట్ తెరిచి అందులో నుంచి ఒక ఇంజక్షన్ తీసి, అప్పటికే నేవర్‌ని కిందపడేసి, పైకెక్కి ఉన్న టి—టి—బి సిక్స్ జబ్బమీద కొట్టాడు. ఇంజక్షన్ ఇవ్వగానే ఆమెలో యాక్షన్ ఆగిపోయింది.

అతణ్ణి వదిలేసి కుర్చీలో కూర్చొని, ఏమీ ఎరగని దానిలా మత్తుతో జోగుతోంది. ఆ యువకునికి ఫస్ట్ ఎయిడ్ చేసి, స్పృహ తెప్పించాడు ఆ అగంతకుడు.

అప్పుడే ఆశ్చర్యం నుండి తేరుకున్న వారందరూ ఆ లాంగ్ కోట్ వ్యక్తిని అడిగారు—ఇదంతా ఏమిటని?— అతడు చెప్పసాగాడు.

"ఆ అమ్మాయి మామూలు అమ్మాయి కాదు. టెస్ట్‌ట్యూబ్ బేబీ. కేర్ చేంబర్‌లలో నుంచి పారిపోయి వచ్చింది. ట్రాన్స్‌ఫార్మేషన్ ఇంకా పూర్తి కాలేదు. ఆమె శరీరం తీవ్ర చలనాన్ని, స్పందనను భరించలేదు.

ఉద్రేకపరిస్తే సెల్స్ విగరస్ రియాక్షన్‌కు గురి అవుతాయి. ఒక్కోసారి ప్రాణాపాయస్థితి కూడా కలగవచ్చు. నేను "క్రియేటివ్ వరల్డ్ లాబ్ చీఫ్‌ని. ఈ "టి—టి—బి—సిక్స్" ను నేనే క్రియేట్ చేసాను. అందుకే అన్ని చోట్లా వెదికి, చివరకు ఇక్కడకు పరుగెత్తుకుంటూ వచ్చాను..."

అని, అప్పుడే కొద్దిగా తేరుకున్న టి—టి—బి—సిక్స్‌ను సమీపించి, "కమాన్ బేబీ!" అంటూ లేవదీసుకుని, నడిపించుకుంటూ వెళ్ళి, కారెక్కాడు.

కారులో కూర్చుని ఉన్న ఆమె ముఖంలో ఏ భావమూ లేదు. అసలేం జరగనట్లే ఉంది. అక్కడున్న అందర్నీ, అందర్లో ఆ యువకుణ్ణి ఒక్కసారి ప్రశాంతంగా చూసింది.

మళ్ళీ దృష్టిని రోడ్డు మీదకు సారించింది. కారు అతివేగంగా ముందుకు దూసుకుపోయింది.

